సాక్షి కామారెడ్డి


శనివారం । 1 । మార్చి । 2025



ఘనంగా సైన్స్ డే

జిల్లాలో శుక్రవారం సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. పలు స్కూళ్లలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

- 9లో ▸



దాహం తీర్చని 'అమృత్'

పట్టణాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చేపట్టిన అమృత్ పథకం పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.3 /17.0

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'సామర్థ్యాలకు అనుగుణంగా విద్యాబోధన చేయాలి'



కామారెడ్డి టౌన్ : ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా విద్యాబోధన చేయాలని డీఈవో రాజు సూచించారు. ఇటీవల డీఎస్సీ- 2024 ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి మూడు రోజుల శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ ఇస్తున్నారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ నూతనోత్తేజంతో పనిచేసి విద్యాశాఖ కీర్తిని ఇనుమడింపజేయాలని సూచించారు. విద్యాబోధనలో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు గంగాకిషన్, రిసోర్స్ పర్సన్లు హరిప్రసాద్, సురేందర్ నాయుడు, లింబాద్రి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇంకా ఫ్రీజింగ్‌లోనే బల్దియా ఖాతాలు

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి బల్దియాకు సంబంధించిన బ్యాంకు ఖాతాలపై ఫ్రీజింగ్ కొనసాగుతోంది. బల్దియా 18 ఏళ్లుగా ఆదాయపు పన్ను చెల్లించడం లేదు. దీంతో ఆదాయపు పన్ను శాఖ 12 రోజుల క్రితం బల్దియా ఖాతాలను ఫ్రీజ్ చేసిన విషయం తెలిసిందే. ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని మున్సిపాలిటీ అకౌంట్ విభాగం అధికారులు ఐటీ శాఖను కోరారు. కనీసం రూ. 8.90 లక్షలు చెల్లించాలన్న ఐటీ విభాగం సూచనతో శుక్రవారం ఆ మొత్తాన్ని చెల్లించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తివేసే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి ఆర్ట్స్, సైన్స్ కళాశాల(స్వయం ప్రతిపత్తి) పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. తెలంగాణ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి సంపత్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ ఫలితాలను ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి కిష్టయ్య మాట్లాడుతూ గతనెలలో నిర్వహించిన పీజీ పరీక్షలలో 91 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో కళాశాల అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు రాములు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాబ్లీ గేట్ల ఎత్తివేత

బాల్కొండ: మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను శనివారం ఎత్తనున్నారు. సుప్రీం ఆదేశాల మేరకు బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను ఏటా జూలై 1న ఎత్తి అక్టోబర్ 28న మూసివేయాలి. అనంతరం ఎగువ ప్రాంతాల్లోని అక్కడక్కడా గుంతల్లో నిలిచిన నీటికి బదులుగా 0.6 టీఎంసీల నీటిని మార్చి 1న బాబ్లీ నుంచి ఎస్సారెస్పీకి వదలాల్సి ఉంటుంది. ఆ తీర్పు ప్రకారం బాబ్లీ గేట్లు తెరిచి 0.6 టీఎంసీల నీటిని దిగువకు వదులుతారు. ప్రస్తుతం బాబ్లీ ప్రాజెక్ట్‌లో కొంతమేరే నీరుంది. ఏటా మార్చి 1న గేట్లు ఎత్తితే 0.2 టీఎంసీల నీరు మాత్రమే వచ్చి చేరుతుంది. కాగా 0.6 టీఎంసీల కోటా పూర్తికాగానే గేట్లను మూసివేయనున్నారు. నీటి విడుదల కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

ముగిసిన కులగణన!

- రెండో విడత సర్వేలో పాల్గొన్న 3,809 కుటుంబాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ముగిసింది. ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. తొలి విడత సర్వేలో జిల్లాలో 3,08,096 కుటుంబాలు పాల్గొన్నాయి. వివిధ కారణాలతో కొన్ని కుటుంబాలు సర్వేలో పాల్గొనలేదు. దీంతో వారి కోసం ప్రభుత్వం మరోసారి సర్వే నిర్వహించింది. గత నెల 16 నుంచి 28 వరకు సర్వే సాగింది. శుక్రవారం సాయంత్రం వరకు 3,809 కుటుంబాలు వివరాలు నమోదు చేయించుకున్నాయి. దీంతో రెండు విడతల్లో కలిపి సర్వేలో పాల్గొన్న కుటుంబాల సంఖ్య 3.12 లక్షలకు చేరింది.

■ కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన లోకేటి చందర్ అలియాస్ స్వామి 1995లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. ప్రస్తుతం దండకారణ్యంలో వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అతడిపై రూ.20 లక్షల రివార్డు ఉంది.



■ పాల్వంచ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన ఎర్రగొల్ల రవి అలియాస్ దినేశ్ 2001 లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఆజాద్ ప్రొటెక్షన్ టీంలో సభ్యుడిగా పనిచేస్తున్నాడు. ఇతడిపై రూ.5 లక్షల రివార్డు ఉంది.



■ కామారెడ్డి మండలం ఇస్రోజీవాడికి చెందిన లోకేటి రమేశ్.. లోకేటి చందర్ అలియాస్ స్వామి కొడుకు. అతడు తండ్రి బాటలోనే పయనిస్తూ 2009లో విప్లవోద్యమంలో చేరాడు. సౌత్ బస్తర్‌లో కొంటా ఏరియా కమిటీ డీసీఎంగా పనిచేస్తున్నాడు. ఇతడిపై రూ.4 లక్షల రివార్డు ఉంది.



■ లోకేటి లావణ్య అలియాస్ శాంతి.. లోకేటి చందర్ అలియాస్ స్వామి కూతురు. ఈమె కూడా 2009 లో అజ్ఞాతంలోకి వెళ్లింది. ఏరియా కమిటీ మెంబర్‌గా పని చేస్తున్నట్లు సమాచారం. ఈమెపై రూ.4 లక్షల రివార్డు ఉంది.



■ సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన లింబయ్యగారి వెంకట్‌రెడ్డి 1999 నుంచి అజ్ఞాతంలో ఉంటున్నాడు. ఆయన ఎక్కడ పనిచేస్తున్నాడన్నది పోలీసులకు తెలియదు. కాగా అతడిపై లక్ష రూపాయల రివార్డు ఉంది.

అజ్ఞాతంలో ఐదుగురు!

జిల్లాలో మావోయిస్టు పార్టీ ఉనికి లేకపోయినా.. ఈ ప్రాంతానికి చెందిన పలువురు మాత్రం ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇస్రోజీవాడికి చెందిన లోకేటి చందర్ అలియాస్ స్వామితోపాటు అతడి కుమారుడు, కూతురు కూడా దండకారణ్యంలోనే ఉంటూ వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఆరెపల్లికి చెందిన ఎర్రగొల్ల రవి అలియాస్ దినేశ్‌తోపాటు అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన లింబయ్యగారి వెంకట్‌రెడ్డి కూడా అజ్ఞాతంలో ఉన్నారు. వీరంతా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసులు సూచిస్తున్నారు.

- దండకారణ్యంలో పనిచేస్తున్న జిల్లా మావోయిస్టులు
- స్వామితో పాటు ఆయన కొడుకు, కూతురుదీ అడవిబాటే
- విప్లవోద్యమంలో ఎర్రగొల్ల రవి, లింబయ్యగారి వెంకట్‌రెడ్డి
- లొంగిపోవాలని సూచిస్తున్న పోలీసులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఒకప్పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ నక్సల్స్ కార్యకలాపాలు జోరుగా సాగేవి. కొన్ని ప్రాంతాల్లో సమాంతర పాలన కొనసాగింది. 1990 నుంచి 2000 మధ్య కాలంలో జిల్లాలో ఆ పార్టీ కార్యకలాపాలు జోరుగా సాగాయి. నక్సలైట్ ఉద్యమం సీరియస్‌గా కొనసాగిన కాలంలో ఉమ్మడి జిల్లాలో చాలా మంది అజ్ఞాతంలో పనిచేశారు. కామారెడ్డి ఏరియా దళం, ఎల్లారెడ్డి ఏరియా దళం, సిర్నాపల్లి ఏరియా దళం, బాన్సువాడ ఏరియా దళం, సిరిసిల్ల ఏరియా దళాలు పనిచేసేవి. అయితే అప్పటి ప్రభుత్వాలు విధించిన తీవ్ర నిర్బంధంతో చాలా మంది లొంగిపోయారు. అలాగే అరెస్టులు, ఎన్‌కౌంటర్లతో జిల్లాలో ఆ పార్టీ తీవ్రంగా దెబ్బతింది. ఉమ్మడి జిల్లాకు చెందిన అజ్ఞాత నక్సల్స్‌తో పాటు మిలిటెంట్లు, సానుభూతిపరులు 125 మంది వరకు ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. వందలాది మంది అరెస్టయ్యారు. అలాగే చాలా మంది లొంగిపోయారు.

మావోయిస్ట్ పార్టీగా అవతరించాక..

2004లో సీపీఐ(ఎంఎల్), పీపుల్స్‌వార్ తదితర పార్టీలు విలీనమై మావోయిస్టు పార్టీగా అవతరించింది. కాగా మావోయిస్టు పార్టీగా ఆవిర్భవించిన సమయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన గంగుల వెంకటస్వామి అలియాస్ రమేశ్ నాయకత్వంలో పార్టీ కార్యకలాపాలు జోరుగానే సాగాయి. ప్రభుత్వంతో చర్చల ప్రక్రియ కొనసాగుతున్నపుడు ఊరూరుకు సాయుధ నక్సల్స్ వెళ్లి సభలు, సమావేశాలు నిర్వహించారు. అదే సమయంలో మానాల వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోయారు. దీంతో జిల్లాలో మావోయిస్టు పార్టీ గట్టి దెబ్బ తగిలింది. అనంతర పరిణామాల నేపథ్యంలో జిల్లాకు చెందిన వారిని పార్టీ ఇతర రాష్ట్రాలకు పంపించింది. దీంతో జిల్లాలో ఆ పార్టీ ఉనికి లేకుండాపోయింది.

జనజీవన స్రవంతిలో కలవాలి

మావోయిస్టు నక్సలైట్ ఉద్యమంలో జిల్లాకు చెందిన ఐదుగురు వ్యక్తులు ఉన్నట్లు ఎస్పీ సింధు శర్మ వెల్లడించారు. కొత్తగూడెం భద్రాద్రి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు నక్సలైట్లు శుక్రవారం ఎస్పీ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతలేమితో, ఇతర అనేక కారణాలతో బలహీనపడిందని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో చాలా మంది మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, సానుభూతి పరులు పార్టీని వదిలేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని లొంగిపోయిన మావోయిస్టుల ద్వారా తెలిసిందన్నారు. జిల్లాకు చెందిన ఐదుగురు వ్యక్తులు అజ్ఞాతంలో ఉన్నారన్నారు. వారు కూడా లొంగిపోతే పునరావాసం కల్పిస్తామని పేర్కొన్నారు. వారు స్వతంత్రంగా జీవించడానికి అన్ని రకాలుగా సాయం చేస్తామన్నారు.

గుంట ఎండినా సహించను



నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్టపై అధికారులతో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ప్రాజెక్టు నీరు అందేలా చూడాలి

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- అర్ధరాత్రి నిజాంసాగర్ ప్రధాన కాలువ పరిశీలన
- ఇరిగేషన్ అధికారులతో కాలువ గట్టుపైనే సమీక్ష



రైతులతో మాట్లాడుతూ..

బాన్సువాడ : నీరు అందక గుంట పంట ఎండినా సహించేది లేదని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను హెచ్చరించారు. గురువారం రాత్రి ఆయన బాన్సువాడనుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామానికి చెందిన రైతు ఫోన్ చేశాడు. నిజాంసాగర్ ప్రాజెక్టు నీరు అందక పంట ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో ఆయన వెంటనే ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌ను వెంటబెట్టుకుని నిజాంసాగర్ ప్రధాన కాలువ డి-26 ప్రాంతానికి వెళ్లారు. రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు డి-26 నుంచి డి-28/1 వరకు నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా విడుదల అవుతున్న నీటిని పరిశీలించారు. రైతులు, ఇరిగేషన్ అధికారులను పిలిచి కాలువ గట్టుపైనే మాట్లాడారు. నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో ప్రతి గుంటకు నీరు అందేలా చూడాలన్నారు. అవసరమైతే తాను కాలువ గట్టుపైనే పడుకుండి పరిస్థితిని సమీక్షిస్తానన్నారు. డి-26 ఉప కాలువ కింద ఎక్కువ విస్తీర్ణంలో ఆయకట్టు ఉందని, చివరి ఆయకట్ట వరకు నీరు వెళ్లాలంటే కనీసం 3 ఫీట్లు తగ్గకుండా ఉప కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని సూచించారు. బీర్కూర్ మండలంలోని బైరాపూర్, మల్లాపూర్, బీర్కూర్, బరంగెడ్గి చెరువులను నింపడంతో పాటు చివరి ఆయకట్ట వరకు సాగు నీరు అందేలా చూడాలన్నారు. రైతులు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట ఏఎంసీ వైస్ చైర్మన్ యామ రాములు తదితరులున్నారు.

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచాలి

- ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలతో వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రతి పంచాయతీ పరిధిలో రోజు కనీసం 50 మంది కూలీలు పనిచేసేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు ప్రారంభించని పనులను సీసీ రోడ్లకు మళ్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. అవసరమైన చోట అద్దె బోరుబావులను సిద్ధం చేసుకోవాలన్నారు. జీపీ ట్రాక్టర్లను తాగు నీటి సరఫరాకు వినియోగించుకోవాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలను ఎంపీడీవోలు పరిశీలించి, మంజూరు కోసం పంపించాలన్నారు. అన్ని మండలాల్లో డెమో కింద మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, డీపీవో శ్రీనివాస్‌రావు, జెడ్పీ సీఈవో చందర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి వచ్చేనెల 4 వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో 12,579 మంది విద్యార్థుల కోసం 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బయటి వ్యక్తులెవరినీ పరీక్ష కేంద్రాలలోకి అనుమతించవద్దన్నారు. ప్రశ్నపత్రాలను పోలీసు స్టేషన్ నుంచి సరఫరా చేస్తామన్నారు. రోజూ పరీక్ష అనంతరం జవాబు పత్రాలను పోస్టాఫీసుకు పంపించాలని సూచించారు. సమావేశంలో డీఈవో రాజు, పరీక్షల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలపై సమీక్ష

కామారెడ్డి క్రైం: ఇంటర్ వార్షిక పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ఈనెల 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్ వార్షిక పరీక్షల ఏర్పాట్లపై ఆమె శుక్రవారం హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులతో సమావేశమై పరీక్షల నిర్వహణపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో ప్రభాకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు ఓటీఎస్‌కు గడువు

- రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- యూరియా పొదుపుగా వాడుకోవాలి
- డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులోని ఖాతాదారులైన రైతుల సౌకర్యార్థం ఏకకాల పరిష్కార పథకం (ఓటీఎస్)కు ఈ నెల 31 వరకు గడువు ఉన్నట్లు డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి తెలిపారు. నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండున్నరేళ్లుగా దీర్ఘకాలిక రుణాల చెల్లింపు, కాలపరిమితి ముగిసిన రుణాల చెల్లింపు కోసం డీసీసీబీలో ఓటీఎస్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ స్కీమ్‌లో భాగంగా వాయిదా మీరిన వడ్డీలో 40 శాతం రాయితీ, అపరాధ వడ్డీలో వందశాతం రాయితీ వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సొసైటీల ద్వారా బట్వాడా చేసిన దీర్ఘకాలిక రుణాలు, డీసీసీబీ ద్వారా బట్వాడా చేసిన నాన్ ఫాం సెక్టార్, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూప్‌లు, దీర్ఘకాలిక మార్ట్‌గేజ్ రుణాలకు వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం సహకార సంఘాలు, డీసీసీబీ శాఖలలో సంప్రదించాలని సూచించారు. ఓటీఎస్‌ను నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని డీసీసీబీ ఖాతాదారులు, సొసైటీ సభ్యులు సద్వినియోగం చేసుకొని రుణ విముక్తులు కావాలని ఆయన కోరారు.

యూరియా కొరత లేదు

జిల్లాలో యూరియా కొరత ఎక్కడా లేదని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చైర్మన్ రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. యూరియాను పొదుపుగా వాడుకోవాలని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ లింగయ్య పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

- ఎక్కువ కేసులను పరిష్కరించాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్

కామారెడ్డి టౌన్: కోర్టులలో ఈనెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించేలా కృషి చేయాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించి లోక్ అదాలత్ విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు లాల్‌సింగ్, శ్రీనివాస్ నాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి, సీనియర్ సివిల్ జడ్జీలు సుమలత, సుధాకర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, ఏఎస్పీ నరసింహారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి డీఎస్పీలు సత్యనారాయణ, శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజ్‌గోపాల్ గౌడ్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సైన్స్ మేళా

భిక్కనూరు: మండల కేంద్రంలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం సైన్స్ మేళాను నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సైన్స్ మేళాను నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఈ మేళాలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని ఆయన కోరారు.

స్వయం పాలన దినోత్సవం



లింగంపేట(ఎల్లారెడ్డి): జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని సజ్జన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థులు కింది తరగతులకు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి విద్యా బోధన చేశారు. అనంతరం శెట్పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు వసుధ మాట్లాడారు. విద్యార్థులు పైతరగతుల్లో బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సాయన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

3న పుత్రకామేష్టి మహాయాగం

కామారెడ్డి అర్బన్: స్థానిక పశ్చిమ హౌసింగ్ బోర్డు కాలనీలోని సంకష్ట హర గణపతి ఆలయంలో ఈ నెల 3న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సామూహిక పుత్రకామేష్టి మహాయాగం నిర్వహిస్తున్నట్లు వేద పండితులు గంగవరం ఆంజనేయశర్మ తెలిపారు. యాగంలో పాల్గొనే దంపతులు 88852 99917 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

5న కృష్ణానంద ఆశ్రమ వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని టేక్రియాల్ శ్రీకృష్ణానంద ఆశ్రమ పంచమ వార్షికోత్సవం, శ్రీరామ జపలిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి 79వ పుట్టిన రోజు ఉత్సవం ఈ నెల 5న నిర్వహించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ఆశ్రమాధిపతులు, ప్రముఖులు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదు

ఖలీల్‌వాడి: ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని డీసీపీ(అడ్మిన్) బస్వారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ శాఖలో పదవీ విరమణ చేసిన నిజామాబాద్ రూరల్ ఏఎస్సై యేముల వెంకయ్య, రుద్రూర్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ కోల విఠల్‌ను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో ఎంతో పనిఒత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవీ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, సిబ్బంది సతీష్, శ్రీనివాస్, తిరుపతి, పాషా తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ..



గురుకులంలో నిద్రిస్తూ..

లక్ష్యంతోనే ఉన్నత శిఖరాలు

- కష్టం అనుకోకుండా ఇష్టపడి చదవాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- భిక్కనూరు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల సందర్శన
- విద్యార్థులకు పాఠాల బోధన



భిక్కనూరు గురుకుల కళాశాలలో పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

భిక్కనూరు: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం రాత్రి ఆయన భిక్కనూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టం అనుకోకుండా ఇష్టపడి చదవాలన్నారు. బాగా చదివి తల్లిదండ్రులకు, గురువులకు పేరు తీసుకురావాలని సూచించారు. జేఈఈ, ఐఐటీల్లో ప్రవేశానికి అవసరమైన స్టడీ మెటీరియల్‌ను సమకూర్చుతామన్నారు. అంతకు ముందు కలెక్టర్‌కు ఎన్‌సీసీ కేడెట్లు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి అక్కడే రాత్రి బసచేశారు. మండల ప్రత్యేకాధికారి రజిత, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, ప్రిన్సిపాల్ రఘు, ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

'పరిశోధనలతో సృజనాత్మకతను అభివృద్ధి చేసుకోవాలి'



సౌత్ క్యాంపస్ సహాయ ఆచార్యులు నాగరాజును సన్మానిస్తున్న అధ్యాపకులు

కామారెడ్డి అర్బన్: శాస్త్ర విజ్ఞానం ప్రపంచాన్ని అద్భుతాలతో అలంకరిస్తుందని, పరిశోధనలతో వివిధ రంగాల్లో సృజనాత్మకతను అభివృద్ధి చేసుకోవాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త సీవీ రామన్ ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్ కనుగొన్నందున జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన సౌత్ క్యాంపస్ కెమిస్ట్రీ సహాయ ఆచార్యులు డి.నాగరాజు 'ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతను శక్తివంతం చేయటం' అనే అంశంపై ప్రధాన ప్రసంగం చేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, అకడమిక్ సమన్వయకర్తలు విశ్వప్రసాద్, అంకం జయప్రకాష్, అధ్యాపకులు దినకర్, మానస, శ్రీలత, రాజశ్రీ, శారద, జి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితులను అధిగమించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మలావత్ రాజేశ్వర్

రామారెడ్డి: లక్ష్యాన్ని సాధించే క్రమంలో విపత్కర పరిస్థితులను అధిగమించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మలావత్ రాజేశ్వర్ నాయక్ సూచించారు. పీఎం శ్రీ పథకంలో భాగంగా శుక్రవారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(ఉప్పల్వాయి)లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇదే గురుకుల పాఠశాలలో చదివి ప్రముఖ శాస్త్రవేత్తగా ఎదిగి ఇదే పాఠశాలకు అతిథిగా రావడం చాలా గర్వంగా ఉందని అన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ శివరాం ప్రసంగించారు. వైస్ ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పీఎంశ్రీ కో–ఆర్డినేటర్ సంతోష్, ఉపాధ్యాయులు అంకం సంతోష్, శ్రీకాంత్ రెడ్డి, అభిలాష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మేరు కులస్తులకు పింఛన్ ఇవ్వాలి



బాన్సువాడలో వినతి పత్రం అందజేస్తున్న మేరు సంఘం ప్రతినిధులు



కామారెడ్డిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం



తాడ్వాయిలో ఆర్‌ఐ హారికకు వినతిపత్రం అందజేస్తూ..

బాన్సువాడ: యాభై ఏళ్లు నిండిన మేరు కులస్తులకు పింఛన్ ఇవ్వాలని శుక్రవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం డీఏవో విజయ్‌కుమార్‌ను మేరు కులస్తులు కోరారు. టైలర్స్ డే పురస్కరించుకుని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈమేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేరు సంఘం అధ్యక్షుడు హన్మాండ్లు మాట్లాడుతూ.. మేరు కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న 50 ఏళ్లు నిండిన మేరు కులస్తులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, దర్జీ కులస్తులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, కులవృత్తి చేసుకునే వారికి అధునాతమైన యంత్రాలు ఇవ్వాలని, సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని అన్నారు. మేరు ఫెడరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయించాలని అన్నారు. నేతలు భాస్కర్, మహేష్, సురేష్, దేవదాస్, శ్రీనివాస్, కోటి మహేష్, తదితరులున్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి..

కామారెడ్డి టౌన్: మేరు వృత్తిదారులకు ప్రతి ఒక్కరికి పింఛన్ సౌకర్యం కల్పించాలని మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు సరికొండ నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సంఘం కార్యాలయంలో టైలర్స్ డేను ఘనంగా జరిపారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విక్టర్‌కు తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టూరి రఘునాథ్, కోశాధికారి రాచర్ల సంతోష్, పట్టణ అధ్యక్షులు గట్ల భాను, ప్రధాన కార్యదర్శి పెండ్యాల దేవేందర్, కోశాధికారి బాలు, గౌరవ అధ్యక్షులు రాచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శుక్రవారం మేరు సంఘం నాయకులు టైలర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బట్టలను కుట్టే మిషన్‌లకు పూజలు చేశారు. అనంతరం కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి మీదుగా తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ప్రభుత్వం తమ సమస్యలు తీర్చాలని కోరుతూ ఆర్‌ఐ హారికకు వినతి పత్రాన్ని అందజేశారు. మేరు సంఘం మండల అధ్యక్షుడు దశరథ్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, కోశాధికారి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పామ్ ఆయిల్ సాగుపై దృష్టి పెట్టాలి



బీబీపేట్: రైతులు పామ్ ఆయిల్ సాగుపై దృష్టి పెట్టాలని హిందుస్థాన్ యూనిలివర్ కంపెనీ జనరల్ మేనేజర్ అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని యాడారం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పామ్ ఆయిల్ పంటలో అంతర పంటలు సాగు చేస్తే లాభాలు ఎలా ఉంటాయో రైతులకు వివరించారు. పంట సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ కుమార్, కంపెనీ ప్రతినిధి సత్యనారాయణ, వెంకట్‌రావు, ధర్మారెడ్డి, సత్యనారాయణ రావు, రైతులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



లింగంపేట(ఎల్లారెడ్డి): కొర్పోల్ గ్రామంలోని హరిహర దేవాలయం వద్ద శుక్రవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టెంకాయ కుస్తీ నుంచి మూడు తులాల వెండి కడెం వరకు కుస్తీ పోటీలు పెట్టారు. పోటీల్లో గెలుపొందిన కుస్తీ వీరులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీలు ఆద్యంతం రసవత్తరంగా సాగాయి. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భాస్కర్, కాశీదాస్, ఏగొండ, రవి, లక్ష్మణ్, రాములు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కొందరికే 'ఇందిరమ్మ' సాయం

- మోర్తాడ్ మండలం గాండ్లపేట్‌కు చెందిన డైడి అమ్మాయి, ముద్దం ఎల్లమ్మలకు వ్యవసాయ భూమి లేదు. వీరిద్దరూ వ్యవసాయ పనులతోపాటు ఉపాధి హామీ పథకం కింద పనులు చేసి జీవిస్తున్నారు. భూమి లేని కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం కింద ఏడాదికి రూ.12వేలను రెండు విడతల్లో అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈక్రమంలో అమ్మాయి, ఎల్లమ్మలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి లబ్ధిదారులుగా ఎంపికైనా తొలి విడతలో జమ కావాల్సిన రూ.6వేలు ఖాతాలోకి చేరలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో భరోసా సొమ్ముకు బ్రేక్ పడింది. అమ్మాయి, ఎల్లమ్మల మాదిరిగానే చాలా మంది వ్యవసాయ కూలీలు భరోసా డబ్బుల కోసం కొన్నిరోజులు ఓపిక పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- మొదట మండలంలో ఒకే గ్రామానికి ఆత్మీయ భరోసా నిధులు
- ఎన్నికల కోడ్‌తో మిగతా లబ్ధిదారులకు బ్రేక్
- కోడ్ లేని జిల్లాల్లో అర్హుల ఖాతాల్లో జమ



మోర్తాడ్(బాల్కొండ): గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకానికి శ్రీకారం చుట్టింది. మొదటిరోజు జిల్లావ్యాప్తంగా మండలానికో గ్రామాన్ని పథకానికి ఎంపిక చేసింది. అందులో భాగంగా జిల్లాలోని 31 గ్రామాల్లో 1,675 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.కోటీ 50వేలను విడుదల చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి జిల్లా వ్యాప్తంగా మొత్తం 38,802 మందిని అర్హులుగా గుర్తించారు. వీరి కోసం ఒక్కో విడతలో రూ.23,28,12,000 మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 1,675 మందికే ఆత్మీయ భరోసా సొమ్ము జమ చేయగా ఇంకా 37,127 మందికి రూ.22,27,62,000 నిధులను కేటాయించాల్సి ఉంది. కాగా, మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కోడ్ అమలు లేని జిల్లాలకు ఆత్మీయ భరోసా నిధులను విడుదల చేయడం గమనార్హం.

కోడ్ ఎత్తివేసిన తర్వాతే స్పష్టత..

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో నిధుల విడుదలకు కోడ్ అడ్డుకాకపోవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ముగియగా, ఓట్ల లెక్కింపు సోమవారం జరగనుంది. దీంతో ఎన్నికల కోడ్ తొలగిపోయేందుకు మరో వారం రోజులు పట్టే అవకాశం ఉంది. కోడ్ ఎత్తివేసిన తర్వాతే ఆత్మీయ భరోసా సొమ్ము జమపై స్పష్టత రానుంది. ఈ విషయమై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను 'సాక్షి' వివరణ కోరగా.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏం చెప్పలేమని వెల్లడించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



నిజామాబాద్ సిటీ: నగరంలోని కంఠేశ్వర్‌లోగల మెప్మా కార్యాలయంలో ఆర్పీలకు, డ్వాక్రా సంఘాల సభ్యులకు శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై మున్సిపల్ ప్రాజెక్టు అధికారి చిదుర రమేష్ అవగాహన కల్పించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సిటిజన్ ఫీడ్‌బ్యాక్ నమోదుతోపాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మొబైల్ యాప్‌లో ప్రశ్నావళిని పూరించే విధానం గురించి వివరించారు. నగరంలోని ప్రతి పౌరుడు ఈ ప్రశ్నావళిని పూర్తిచేయాలని, దీంతో నగరానికి ర్యాంక్ ఇవ్వనున్నట్లు తెలిపారు. నగరవాసులు తమకు అందుతున్న సేవలను యాప్‌లో ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని సూచించారు.

క్రైం కార్నర్

నగరంలో ఒకరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని పూసలగల్లీకి చెందిన బద్దూరి లక్ష్మణ్(41) గతేడాది కాలంగా కాళ్లకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. ఎంతకీ వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం

మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన వివాహిత కారం సుజాత అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గత నెల 15న భర్త కారం నవీన్‌తో ఆమె గొడవ పడి ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఇప్పటికీ ఆమె ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

మాచారెడ్డి: పాల్వంచ మండలంలోని మర్రి వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అనిల్ మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకుని సీజ్ చేశామన్నారు. ఒక ఇసుక ట్రాక్టర్‌ను కూడా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

అడవుల్లో ఇసుక డంపులు



రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట, మద్దికుంట, సింగరాయపల్లి అటవీ ప్రాంతంలో భారీగా ఇసుక డంపులు కలకలం సృష్టించాయి. ఇసుక డంపులకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. యథేచ్ఛగా అటవీ ప్రాంతంలో నుంచి అక్రమార్కులు ఇసుక తవ్వకాలు చేస్తున్నా ఫారెస్ట్, రెవెన్యూ, పోలీసు అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తీసుకొచ్చేందుకు అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లను నరికి వేసినా అటవీశాఖ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. వెంటనే ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్




హాజరైన మహిళలు

- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్‌అర్బన్: మహిళలకు ఆర్థిక అక్షరాస్యత ఎంతో అవసరమని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా 'పొదుపు చేసే మహిళా సాధిస్తుంది ఘనత' అనే అంశంపై లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు డబ్బులను పొదుపు చేసుకునేందుకు బడ్జెట్ రూపొందించుకోవాలని, అనవసర ఖర్చులను తగ్గించాలని సూచించారు. వ్యాపార లావాదేవీల ద్వారా లాభాలు ఆర్జించడమే కాకుండా, ఆర్థికపరమైన నిర్వహణ అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సురక్షితమైన పొదుపు మార్గాలను ఎంచుకోవాలని హితవుపలికారు. ప్రైవేట్ సంస్థలు, వ్యక్తుల నుంచి రుణాలు తీసుకుంటే అధిక వడ్డీలు చెల్లించాల్సి వస్తుందని, దీంతో ఆర్థికంగా నష్టం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న తోడ్పాటును పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించే గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సాయాగౌడ్, లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

బురదలో పడి రైతు మృతి



సాయినాథ్ మృతదేహం

రుద్రూర్: మండలకేంద్రంలో ఓ రైతు పొలం గట్టుపై వెళుతుండగా ప్రమాదవశాత్తు బురదలో పడి మృతిచెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన కాదరి సాయినాథ్ (38) అనే రైతు గురువారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. గట్టుపై నడుచుకుంటు వెళుతుండగా అకస్మాత్తుగా బురదలో పడిపోయాడు. వెంటనే స్థానికులు అతడిని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య అర్చన శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫిట్స్ రావడంతో కాలువలో పడి ఒకరు..

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ గ్రామంలో ఓ వ్యక్తికి ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి మృతిచెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ తెలిపారు. వివరాలు ఇలా.. శ్రీనగర్ గ్రామానికి చెందిన చండీ కృష్ణ(37) వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవాడు. రోజువారి మాదిరిగా శుక్రవారం అతడు స్థానిక పంటపొలాలకు వెళ్లగా, ఫిట్స్ రావడంతో పక్కనే ఉన్న కాలువలో పడి, మృతిచెందాడు. అతడిని స్థానికులు గమనించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేసవిలోనూ నిరంతర విద్యుత్



సుభాష్‌నగర్: వేసవిలోనూ నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడమే లక్ష్యంగా ఎన్‌పీడీసీఎల్ పని చేస్తుందని ఎస్ఈ రాపల్లి రవీందర్ అన్నారు. నగరంలోని డీ–2 సెక్షన్ తిలక్‌గార్డెన్ సబ్‌స్టేషన్‌లోగల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 8.0 ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏగా మార్చి అమర్చారు. ఈసందర్భంగా శుక్రవారం నూతన ఎంవీఏను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తిలక్‌గార్డెన్ సబ్‌స్టేషన్‌లో రెండు 8.0 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని, అందులో ఒక 8.0 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రూ.1.50 కోట్లతో 12.5 ఎంవీఏగా మార్చామని తెలిపారు. పట్టణ ప్రజలకు సబ్‌స్టేషన్‌లో అంతరాయం ఏర్పడితే మరో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అందించడానికి 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చామన్నారు. డీఈ ఎం శ్రీనివాస్‌రావు, డీఈఎంఆర్‌టీ వెంకటరమణ, టౌన్–2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి, ఏడీఈలు చంద్రశేఖర్, వీరేశం, నటరాజ్, తోట రాజశేఖర్, ఏఈలు జాకీర్‌అలీ, రాజేందర్‌రెడ్డి, సాయిలు, దుర్గా ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కోటగల్లి ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం శాస్త్రము–ఆరోగ్యము అనే అంశంపై జిల్లా వైద్య శాఖ హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగాలు దరి చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామచందర్ గైక్వాడ్, ఉపాధ్యాయులు దయానంద్, సౌందర్య, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.